క్లుప్తంగా

జేఈఈ మెయిన్స్‌లో సత్తెనపల్లి విద్యార్థి ప్రతిభ


హర్షిత్

సత్తెనపల్లి: జేఈఈ మెయిన్స్‌లో సత్తెనపల్లికి చెందిన కురువెళ్ల హర్షిత్ ఆల్ ఇండియా స్థాయిలో ఉత్తీర్ణత సాధించాడు. 99.99 శాతం మార్కులతో ఆల్ ఇండియా స్థాయిలో 352వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్‌లో 20వ ర్యాంకు సాధించాడు. హర్షిత్ పదో తరగతిలో 594 మార్కులు, ఇంటర్మీడియట్‌లో 987 మార్కులు సాధించాడు. ఐఐటీలో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ చేసి సాఫ్ట్‌వేర్ ఇంజినీరు కావాలన్నదే లక్ష్యమని హర్షిత్ చెబుతున్నాడు. తండ్రి సాంబశివరావు కిరణా వ్యాపారి. కుమారుడు మాత్రం సరస్వతి పుత్రుడిగా సత్తెనపల్లి పట్టణానికి గర్వంగా నిలిచాడు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య ప్రముఖులు, శ్రేయోభిలాషులు, ఉపాధ్యాయులు బుధవారం హర్షిత్‌కు అభినందనలు తెలిపారు. వారిలో మిత్రులు దూపగుంట్ల సుధాకర్, పెరుమాళ్ల ప్రసాద్, మద్ది భాస్కర్, ప్రసన్న కుమార్, మహేష్, ఐ. శ్రీనివాసరావు, కె శ్రీనివాసరావు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


నర్సయ్య మృతదేహం

రాజుపాలెం: అతి వేగంతో ముందున్న బైకును కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని అద్దంకి–నార్కెట్‌పల్లి రహదారిపై పెదనెమలిపురి సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. పెదనెమలిపురి గ్రామానికి చెందిన కంకణంపాటి నర్సయ్య(50) కొండమోడు సమీపంలోని వీరమ్మ కాలనీకి వెళ్లి తిరిగి బైకుపై స్వగ్రామానికి వస్తున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి ఒంగోలుకు అతి వేగంగా వెళుతున్న కారు వెనుక నుంచి బైకును ఢీకొనడంతో నర్సయ్యకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వేణుగోపాల్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అచ్చంపేట: లైన్ల మరమ్మతులలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలలో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆ శాఖ ఏఈ జి. శివకోటిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు, వ్యాపారులు సహకరించాలని ఆయన కోరారు.

రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

వేమూరు: రైతులకు యాభై శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి చందోలు సునీత అన్నారు. అమర్తలూరు మండలంలోని జంపని రైతు భరోసా కేంద్రంలో బుధవారం రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె సాయిల్ హెల్త్ కార్డు ద్వారా ఎరువులు వాడడం వల్ల ఉపయోగాలను వివరించారు. రైతులంతా మట్టి నమూనా తీసి ల్యాబ్‌కి పంపి భూమిలో పోషకాలను తెలుసుకోవాలని ఆమె సూచించారు. వరి విత్తనాలు కావాల్సిన రైతులు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రంలో తెలియజేయాలని ఆమె కోరారు. రెవెన్యూ శాఖ ద్వారా కౌలు రైతులంతా కార్డులు పొందాలని తెలిపారు. కౌలు కార్డు ఉండటం వల్ల వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం అందించే పథకాలను పొందవచ్చని ఆమె సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయాధికారి మహాలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ కౌలు కార్డులందించాలి

ముప్పాళ్ల: అర్హులైన కౌలు రైతులందరికీ కార్డులు అందించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ సీహెచ్.లక్ష్మీప్రసాద్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వ్యవసాయ శాఖ సిబ్బందితో కౌలు కార్డులపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ మాట్లాడుతూ మండలానికి 2,071 కార్డులను కేటాయించారని, ప్రతి గ్రామంలో అర్హులైన కౌలు రైతులతో దరఖాస్తు చేయించి కార్డు అందించాలని తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ సమన్వయంతో పనిచేసి లక్ష్యాన్ని పూర్తి చేయాలని చెప్పారు. నీటి తీరువా మండలంలో రూ.1.29 కోట్ల బకాయిలు ఉన్నాయని తెలిపారు. గ్రామాల వారీగా బకాయిల వివరాలపై సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సిబ్బంది వెంటనే స్పందించి నీటి తీరువా వసూలు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో ఆర్‌ఐ ఆంజనేయులు, ఆయా గ్రామాల వీఆర్వోలు, ఏఈఓలు పాల్గొన్నారు.

అచ్చంపేట ఇన్‌చార్జి సర్వేయరుగా వీరయ్య

అచ్చంపేట: మండల ఇన్‌చార్జి సర్వేయరుగా బెల్లంకొండ సర్వేయర్ కె.వీరయ్యను నియమిస్తూ జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సీహెచ్. భానుకీర్తి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ మండల సర్వేయరుగా పనిచేసిన యు.ఏడుకొండలు సస్పెండ్ అయిన సంగతి తెలిసిందే. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు వీరయ్య ఇన్‌చార్జి సర్వేయరుగా కొనసాగనున్నారు.

కూటమి ఏడాది పాలనంతా అబద్ధాల పుట్ట

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి ధ్వజం
- సత్తెనపల్లిలో కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- ఎన్నికల హామీలకు తూట్లు పొడిచిన కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం


సత్తెనపల్లి తహసీల్దార్ కెఎస్.చక్రవర్తికి వినతి పత్రం అందిస్తున్న సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, నాయకులు


అచ్చంపేట నుంచి నిరసనకు తరలి వెళుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి పదవి కోసం కాళ్లు కడిగి కన్యాదానం చేసిన సొంత మామ ఎన్టీఆర్‌ను నాడు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయక నేడు మరోసారి రాష్ట్ర ప్రజలకు పొడిచాడని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో నిర్వహించిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి గడియార స్తంభం వరకు, అక్కడ నుంచి తిరిగి తహసీల్దార్ కార్యాలయం వరకు వైఎస్సార్ సీపీ శ్రేణులు కదం తొక్కారు. అనంతరం తహసీల్దార్ కేఎస్ చక్రవర్తికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి రావడమే పరమావధిగా అడ్డగోలుగా హామీలు ఇవ్వడం, ఆపై ప్రజలను వంచించడంలో చంద్రబాబు నాయుడుని మించినవారు దేశంలోనే లేరని తెలిపారు. చంద్రబాబు గద్దెనెక్కిన ప్రతిసారి ప్రజలకు ఇది అనుభవపూర్వకమేనని పేర్కొన్నారు. ఈసారి సూపర్ సిక్స్‌తో పాటు 'బాబు షూరిటీ – భవిష్యత్తు గ్యారెంటీ' పేరిట 143 హామీలను గుప్పించిన కూటమి నేతలు ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి కుచ్చుటోపీ పెడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూస్తుంటే భయమేస్తోందని, సూపర్ సిక్స్ అమలు చేయడం కష్టమేనంటూ సీఎం చంద్రబాబు అసెంబ్లీలో నాలుక మడత తిప్పడంతో ప్రజలు అవాక్కవుతున్నారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు అందక పేద ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెప్పిన తేదీకి క్యాలెండర్‌లా పథకాల అమలు చేస్తే..దానికి భిన్నంగా కూటమి ప్రభుత్వం ప్రజలను వంచిస్తోందని విమర్శించారు. ఏడాది పాలనలో ఎన్నికల హామీలకు తూట్లు పొడిచిన ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తోందని మండిపడ్డారు. సూపర్ సిక్స్ అమలుపై ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై వెంటనే కేసులు నమోదు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను చైతన్యవంతం చేసి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలు అమలు చేసే వరకు పోరాడుతామని, ఇది కేవలం ఆరంభం మాత్రమేనని స్పష్టం చేశారు. ఇకపై అనేక ఉద్యమాలు చేసి ప్రభుత్వ మెడలు వంచుతామని తెలిపారు. వెన్నుపోటు దినం కార్యక్రమానికి ఊహించని రీతిలో హాజరై విజయవంతం చేసిన వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిట్టా విజయభాస్కర్‌రెడ్డి, పక్కాల సూరిబాబు, చల్లంచర్ల సాంబశివరావు, షేక్ నాగూర్ మేరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, పెండెం బాబూరావు, షేక్ మౌలాలి, రాయపాటి పురుషోత్తమరావు, వేపూరి శ్రీనివాసరావు, నక్కా శ్రీను, భవనం రాఘవరెడ్డి, గంగారపు అనూష, రాజరావు శివనాగేశ్వరరావు, కళ్లం విజయభాస్కరరెడ్డి, చిలకా జైపాల్, నియోజకవర్గంలోని జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీగా తరలివెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

అచ్చంపేట: పెదకూరపాడు నియోజకవర్గ స్థాయిలో క్రోసూరులో జరిగిన సీయం చంద్రబాబు వెన్నుపోటు నిరసన కార్యక్రమానికి అచ్చంపేట నుంచి భారీగా వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలి వెళ్లారు. ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా అచ్చంపేటలో జెడ్పీటీసీ సభ్యుడు విజయప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పాలన వచ్చి ఏడాది గడుస్తున్నా ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. అదే జగన్‌మోహన రెడ్డి మొదటి యేడాదిలోనే 90శాతం హామీలు నెరవేర్చారని గుర్తు చేశారు. హామీలు నెరవేర్చకపోగా సజావుగా సాగుతున్న ఇంటింటికీ రేషన్ విధానాన్ని రద్దు చేయడం దారుణమని పేర్కొన్నారు. ఏడాదిలోనే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, మాజీ ఎంపీపీ గంగసాని బాబు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, కోగంటివారిపాలెం సర్పంచ్ నాగరెడ్డి, మాజీ సర్పంచ్ సుంకర శ్రీనివాసరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జాని, జిల్లా కార్యదర్శి సందెపోగు పున్నారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరాల రమేష్, పార్టీ టౌన్ కన్వీనర్ షేక్ సమరం, అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు, ఇస్సాకు, సుభాని పాల్గొన్నారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం పేరిట అరాచక పాలన


వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు


డీటీకి అర్జీ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే నంబూరు

- వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి కదం తొక్కిన వైఎస్సార్ సీపీ నేతలు
- మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో భారీగా తరలి వచ్చిన పార్టీ శ్రేణులు, ప్రజలు

క్రోసూరు: రాష్ట్రంలో చంద్రబాబు రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో అరాచక పాలన చేయడం మినహా ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చలేదని మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు విమర్శించారు. మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో బుధవారం క్రోసూరులో నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. వేల మంది వెంట రాగా నాలుగు రోడ్ల కూడలిలో డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందించారు. అనంతరం మాజీ శాసన సభ్యులు నంబూరు శంకరరావు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను వెన్నుపోటు పొడిచిన ఘనత ఒక్క చంద్రబాబుకే దక్కుతుందని విమర్శించారు. అమలుకాని హామీలు ఇచ్చి ఏడాదిలో ఒక్కదాన్ని అమలుచేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచారని ధ్వజమెత్తారు. అమ్మఒడి, రైతు భరోసా, 50ఏళ్లకే ఎస్సీ,ఎస్టీ బీసీ, మైనారిటీలకు పెన్షన్, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు తదితర 147 హామీలిచ్చి ఒక్కదాన్ని కూడా అమలు చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రతి గ్రామంలో,ప్రతి మండలంలో అరాచక పాలన కొనసాగిస్తోందని తెలిపారు. రైతులు మద్దతు ధర లేక పండిన పంట అమ్ముకోలేక రోడ్డున పడ్డారని, ఉద్యోగస్తులకు డీఏలు,పీఆర్సీలు, వంటి హామీలు నెరవేర్చక రోడ్డు ఎక్కారని తెలిపారు. గత ఐదు సంవత్సరాలు పెదకూరపాడు నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసి సంక్షేమ పాలన అందించామని చెప్పారు. ఇవాళ ఇసుక, మట్టి, రేషన్ మాఫియాల అవినీతి రాష్ట్రంలో నిండిపోయిందని విమర్శించారు. కార్యక్రమంలో క్రోసూరు జెడ్పీటీసీ జమీలాగఫూర్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఈదా సాంబి రెడ్డి, ఎంపీపీ పి.కోటయ్య, సొసైటీ మాజీ అధ్యక్షుడు అనుమల కోటిరెడ్డి, పాశం శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, జిల్లా యూత్ నాయకులు అనుముల రోశిరెడ్డి, కాల్వపల్లి శ్రీనివాసరెడ్డి, కాల్వపల్లి సురేంద్రరెడ్డి, గార్లపాటి దాసు, విప్పర్ల మాజీ సర్పంచ్ నర్రా వాసు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చిలకా పెదబాబు, ఊటుకూరు అల్లురెడ్డి, బోళ్ల వెంకటరెడ్డి, జన్నవరపు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ వి.వెంకట్రామిరెడ్డి, పీసపాడు మాజీ సర్పంచ్ గొర్రెపాటి రాజు, విప్పల రాజశేఖరరెడ్డి, కామేశ్వరీబాయి, సయ్యద్ అబ్దుల్ రహీం, నరసింహారెడ్డి, అచ్చంపేట నాయకులు మండల కన్వీనర్ చిలకా చంద్రయ్య, జెడ్పీటీసీ సభ్యుడు విజయ ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గంగసాని బాబు, పెదకూరపాడు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, జెడ్పీటీసీ సభ్యుడు కంకణాల స్వర్ణకుమారి శివాజీ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్‌బాజీ, అమరావతి మండల కన్వీనర్ భవిరిసెట్టి హనుమంతరావు, ఆలా లక్ష్మీనారాయణ, షేక్ హష్మి, కొండవీటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మా పొట్టగొడుతున్న ప్రభుత్వం

షిఫ్ట్ ఆపరేటర్ల ఆవేదన


షిఫ్ట్ ఆపరేటర్లు బాణావత్ రవినాయక్, పట్టంశెట్టి సుబ్బారావు

నకరికల్లు: ఐదేళ్లుగా పనిచేస్తున్న తమను నిర్దాక్షిణ్యంగా విధుల నుంచి తొలగించి కూటమి ప్రభుత్వం తమ పొట్ట గొడుతోందని షిఫ్ట్ ఆపరేటర్లు వాపోతున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో నియమించబడ్డామన్న ఒకే ఒక్క కారణంతో తమను తొలగించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం వారి గోడును వెలిబుచ్చారు. పల్నాడు జిల్లా నకరికల్లు మండలం పరిధిలో ఐదు విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వాటిలో 20 మంది షిఫ్ట్ ఆపరేటర్లు ప్రస్తుతం పని చేస్తున్నారు. కాగా వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చే నాటికి ఖాళీగా ఉన్న 11 పోస్టులను దఫాల వారీగా భర్తీ చేశారు. కొత్తగా ఉద్యోగం పొందిన షిఫ్ట్ ఆపరేటర్లు అప్పటి నుంచి పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సబ్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లను తొలగించి వారి స్థానంలో తమ వారిని చేర్చుకోవాలన్న ప్రయత్నాలు ముమ్మరం చేశారు. దానిలో భాగంగా 2020లో విధుల్లో చేరి చేజర్ల గ్రామంలోని సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న బాణావతు రవినాయక్, పట్టంశెట్టి సుబ్బారావు, కండ్లకుంటలో పనిచేస్తున్న దండే ఆదినారాయణ, షేక్ అబ్దుల్‌బాషాలను ఇటీవల తొలగించారు. మిగిలిన ఏడుగురిని కూడా తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు బాధితులు మాట్లాడుతూ తమను అన్యాయంగా తొలగించారని, కలెక్టర్ వద్దకు వెళ్లి గోడు వెలిబుచ్చామని తెలిపారు. అయినా విద్యుత్ శాఖ అధికారులు ఏ మాత్రం కనికరించడం లేదని వాపోయారు. ఉద్యోగాలు తొలగించడం వల్ల పేదలమైన తమ జీవితాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ పేరుతో తమ పొట్ట కొడుతున్నారని వాపోయారు. తమను వెంటనే విధుల్లోకి తీసుకోకుంటే ఆత్మహత్యలే శరణ్యమని కన్నీరుమున్నీరవుతున్నారు. కొసమెరుపు ఏమిటంటే ఏ సబ్‌స్టేషన్ నుంచి ఎవరిని తొలగిస్తున్నారు... కొత్తగా తీసుకుంటున్న వ్యక్తికి ఎవరు సిఫారసు చేస్తున్నారన్న జాబితాను కూడా అధికారులే సిద్ధం చేసి అంతర్గతంగా విడుదల చేయడం విస్మయంతో పాటు చిరుద్యోగులపై ప్రభుత్వ నిబద్ధతకు అద్దం పడుతుంది.

వేసవి విజ్ఞాన శిబిరంలో ఐక్యూ, క్విజ్ పోటీలు



క్రోసూరు: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు ఐక్యూ, క్విజ్ పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ తెలిపారు. ఐక్యూ పోటీల్లో సంయుక్త, రూప ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందారని చెప్పారు. క్విజ్ పోటీల్లో ఏ గ్రూప్‌లో ఎం.అంజనీ హేమలత, ఎం.నందిని, శ్రావణ్, కె.సువిష్ణ ప్రథమ,ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాల్లో నిలిచారని తెలిపారు. బీగ్రూప్‌లో సంయుక్త, కె.సాయి, ఏ.వినయ్, కె.సిరి వరుసగా విజేతలుగా నిలిచారని పేర్కొన్నారు. విజేతలకు శిబిరాలు ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని ఆమె చెప్పారు.

రాగి జావ పంపిణీ

పెదకూరపాడు: జన చైతన్య సమితి ఆధ్వర్యంలో పెదకూరపాడులో బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు జన్మదిన సందర్భంగా బుధవారం బాటసారులకు రాగి జావ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు మాట్లాడుతూ వాహనదారులకు, బాటసారులకు రాగి జావ పంపిణీ చేస్తున్న జన చైతన్య సమితి ప్రతినిధులు అభినందనీయులన్నారు. జన చైతన్య సమితి కార్యదర్శి తల్లూరి సాంబశివరావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు చేయూతనందిస్తున్న పూర్ణచంద్రరావు ఆదర్శనీయులని పేర్కొన్నారు. కార్యక్రమంలో షేక్ నన్నేమియా, దాసరి కారుణ్య బాబు,అన్నవరపు సిద్ధార్థ రాయ్ పాల్గొన్నారు.



నేడు వేద గాయత్రీ మాత ఆవిర్భావ దినోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని ఎస్బీఐ రోడ్డులో గల ఫిరోజీ ఋషీంద్రుల మఠంలో శ్రీ పంచముఖీ వేద గాయత్రీ అమ్మవారి ఆలయంలో గురువారం వేద గాయత్రీ మాత ఆవిర్భావ దినోత్సవం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 6 గంటలకు అచ్చంపేట రోడ్డులోని శివాలయం నుంచి అమ్మవారికి పసుపుకుంకుమ, పూల కావిడులు, శ్రీ లక్ష్మీనరసింహ స్వామికి పానకం కావిడులతో ఊరేగింపు బయలుదేరుతుందని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు గాయత్రీ మాతకు అన్నాభిషేకం, 10 గంటలకు గాయత్రీ హోమం జరుగుతుందని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులుకావాలని ఆయన కోరారు.

నేడు సత్తెనపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

సత్తెనపల్లి: స్థానిక మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని గురువారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో ఎంపీపీ జైబూన్‌బీ యలవర్తిపాటి షేక్ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు వారి శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, కో–ఆప్షన్ మెంబర్లు, అన్ని గ్రామాల సర్పంచులు హాజరుకావాలని ఆయన కోరారు. సమావేశానికి ఎక్స్‌అఫీషియో హోదాలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరవుతారని తెలిపారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి


హనుమంత్‌ను సత్కరిస్తున్న నంబూరు శంకరరావు


జానీని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పార్టీ ప్రచార విభాగం సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన పెదకూరపాడు మండలం బలుసుపాడు గ్రామానికి చెందిన బొచ్చు హనుమంత్ వెంకట సుబ్బారావు అన్నారు. బుధవారం మాజీ శాసన సభ్యులు నంబూరు శంకరరావుని మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హనుమంత్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో పదవి ఇచ్చిన పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, పెదకూరపాడు మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, పెదకూరపాడు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, సొసైటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

షేక్ జానీకి అభినందనలు

అచ్చంపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన అచ్చంపేట సర్పంచ్ షేక్ జానీని బుధవారం మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అభినందించారు. పార్టీలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందనడానికి జానీనే నిదర్శనమని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి కొమరాల రమేష్, జిల్లా కార్యదర్శి సందెపోగు పున్నారావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, కోగంటివారిపాలెం మాజీ సర్పంచ్ సుంకర శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ బోనం నాగిరెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ రామిశెట్టి చిన్నయల్లమంద, కంబాల వీరబాబు, గంజినబోయిన రామచంద్రరావు, షేక్ బీరువాల జాని పాల్గొన్నారు.

మలేరియా మాసోత్సవ ర్యాలీ

మాదల(ముప్పాళ్ల): మండలంలోని మాదలలో బుధవారం మలేరియా మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలపై హెల్త్ సూపర్‌వైజర్ ఎం.జోస్పిన్‌రాణి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. మురుగు కాల్వలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. ర్యాలీలో ఏఎన్ఎంలు అన్నామణి, మరియమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏడాది పాలనపై కూటమి నేతల సంబరాలు


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా పట్టణంలోని రఘురాంనగర్‌లో గల ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో టీడీపీ నేతలు బుధవారం సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కేక్ కట్ చేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీస్తోందని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు యెల్లినేడి రామస్వామి, దరువూరి నాగేశ్వరరావు, చౌటా శ్రీనివాసరావు, సయ్యద్ పెద్దకరీముల్లా, కోమటినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.